సంచలన సాయంకాల పత్రిక
# సత్య
గురువారం 31-7-2025
సంపుటి: 21 సంచిక: 110
పేజీలు : 8 వెల: రూ.1



• ఎడిటోరియల్

# అక్కడ రివర్స్ ద్రవ్యోల్బణం.. దేనికి సంకేతం

ఆర్థికరంగం స్థిరంగా ఉండాలంటే.. నిత్యావసరాలతో సహా ఇతరత్రా వస్తువులు, సేవల ధరలు అదుపులో ఉండాలంటే ద్రవ్యోల్బణం(ఇన్‌ఫ్లేషన్) నియంత్రణలో ఉండాలి. మరో రకంగా చెప్పాలంటే ద్రవ్యోల్బణం అంటే ధరల పెరుగుదలకు సూచిక. ఇది అదుపులో ఉంటే ధరలు అదుపులో ఉన్నట్లే లెక్క. కేంద్ర ఆర్థిక శాఖ, రిజర్వ్ బ్యాంకు ద్రవ్యోల్బణం రేటును ఎప్పటికప్పుడు ప్రకటించడంతో పాటు దానికి అనుగుణంగా ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకుంటుంటాయి. ఒకవేళ ద్రవ్యోల్బణం తిరోగమనంలో పయనిస్తే దాన్ని రివర్స్ లేదా ప్రతి ద్రవ్యోల్బణం(డిఫ్లేషన్)గా వ్యవహరిస్తారు. అంటే ధరలు క్రమంగా తగ్గిపోతున్నప్పుడు ప్రతి ద్రవ్యోల్బణంగా నమోదవుతుంది. అయితే భారతదేశ చరిత్రలో జాతీయస్థాయిలో గానీ, రాష్ట్రాలస్థాయిలో గానీ ఇంతవరకెన్నడూ ప్రతి ద్రవ్యోల్బణం నమోదైన దాఖలా ల్లేవు. కానీ ఇప్పుడు తొలిసారి ఒక రాష్ట్రం ఆ దిశగా పయనిస్తున్నట్లు తాజా ద్రవ్యోల్బణ సూచీ వెల్లడించింది. అదే మన దాయాది తెలుగు రాష్ట్రం తెలంగాణ. అంటే ఆ రాష్ట్రంలో వస్తు, సేవల ధరలు బాగా తగ్గిపోతున్నట్లు భావించాలి. కానీ ధరలు తగ్గుముఖం పట్టిన దాఖలాలు లేకపోయినా.. కేంద్ర ప్రభుత్వం ద్రవ్యోల్బణం అంచనాకు కొన్ని ప్రమాణాలు నిర్దేశించింది. వాటిని అనుసరించి ద్రవ్యోల్బణం, ప్రతి ద్రవ్యోల్బణం అనే దాన్ని ఆర్థిక శాఖ ప్రకటిస్తుంటుంది. కానీ క్షేత్రస్థాయిలో ధరల పరిస్థితికి, ఈ అంచనాలకు చాలావరకు పొంతన ఉండదు. ఆ సంగతి పక్కన పెడితే.. దేశంలో డిఫ్లేషన్‌లోకి వెళ్లిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ అరుదైన ఆర్థిక పరిస్థితిలోకి అడుగుపెట్టింది. ఈ నెల 15న కేంద్ర గణాంక శాఖ (ఎంవోఎస్‌పీఐ) విడుదల చేసిన సమాచారం ప్రకారం 2025 జూన్ నెలలో తెలంగాణలో ద్రవ్యోల్బణ రేటు తిరోగమనంలో పడి -0.93 శాతంగా నమోదైంది. ఇదే సమయానికి జాతీయ సగటు ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉంది. ఆ రాష్ట్రంలో పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం మరింతగా తగ్గింది. గ్రామీణ తెలంగాణలో ఇది -1.54 శాతంగా ఉండగా దేశ సగటు గ్రామీణ ద్రవ్యోల్బణం 1.72 శాతంగా ఉంది. అలాగే పట్టణ తెలంగాణలో -0.45 శాతం ఉండగా జాతీయ సగటు పట్టణ ద్రవ్యోల్బణం 2.56 శాతంగా ఉంది. మరో తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో కూడా ధరల పెరుగుదల చాలా తక్కువగా ఉంది. ఆ రాష్ట్రంలో ద్రవ్యోల్బణం 0.0 శాతంగా ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో -0.55 శాతం, పట్టణాల్లో మాత్రం 1.06 శాతంగా నమోదైంది. తెలంగాణలో 2020 నుంచి 2023 వరకు ద్రవ్యోల్బణం 10 శాతం పైగా ఉండేది. ఆ సమయంలో ప్రజలు అన్ని వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందిపడ్డారు. కానీ 2023 డిసెంబర్ తర్వాత ధరలు తగ్గడం మొదలైంది. 2025 ఫిబ్రవరిలో 1.31 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది. మార్చిలో 1.06 శాతం, ఏప్రిల్‌లో 1.26 శాతం, మే నెలలో 0.55 శాతం, జూన్ నెలలో -0.93 శాతంగా ఉంది. ధరల తగ్గుదల తమ ప్రభుత్వ విజయమేనని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. 'ఇది ప్రజలకే ప్రయోజనకరంగా ఉండే పాలన ఫలితం' అని ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల వల్ల ప్రజల ఖర్చులు తగ్గాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఆహార ధరలు తగ్గడం, విద్యుత్ చార్జీల నియంత్రణ కూడా డిఫ్లేషన్‌కు కారణమయ్యే అంశాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే దీన్ని ప్రభుత్వ పథకాల ఫలితంగా మాత్రమే చూడకూడదని, మార్కెట్‌లో ఉన్న ఇతర కారణాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. తాత్కాలికంగా చూస్తే ధరల తగ్గుదల వినియోగదారులకు ఊరటగానే అనిపించినా దీర్ఘకాలంలో మాత్రం ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని మరికొందరు ఆర్థిక నిపుణులు వాదిస్తున్నారు. డిఫ్లేషన్ అంటే నిత్యావసర ధరలు తగ్గడం ఒక్కటే కాదని.. మార్కెట్ డిమాండ్ తగ్గడం, పెట్టుబడులు తగ్గిపోవడం, ఆర్థిక మందగమనానికి సంకేతంగా కూడా భావించాలంటున్నారు. అయితే ప్రస్తుతం తెలంగాణ పరిస్థితి ఆ స్థాయికి వెళ్లలేదని, ఇది ప్రభుత్వ చర్యల వల్ల కలిగిన సరఫరా - ధరల నియంత్రణ ఫలితంగా నెలకొన్న పరిస్థితి అన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ద్రవ్యోల్బణం మైనస్‌లోకి వెళ్లడం అంటే ఆర్థిక సంక్షోభానికి సంకేతమనే మరో అభిప్రాయం ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు భయంతోనే ఖర్చులు తగ్గిస్తున్నారని దీని కారణంగానే మార్కెట్లో అస్థిరత ఉందని కూడా విశ్లేషిస్తున్నారు. ఏది ఏమైనా తెలంగాణలో ప్రస్తుతం భిన్న ఆర్థిక పరిస్థితి నెలకొందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

## ఎయిర్‌కూలర్ వితరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




గ్రామసేవ-రామ సేవ నినాదంతో సమాజసేవ నిమిత్తం నాయుడు గారి ఫౌండేషన్ ద్వారా శ్రీముఖలింగం గ్రామంలో దివ్యాంగుడైన టీకొట్టు శ్రీనుకు గురువారం ఎయిర్ కూలర్ ఉచితంగా అందించారు. కార్యక్రమంలో నాయుడు గారి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, యునైటెడ్ నేషన్స్ ఎగైనెస్ట్ కరప్షన్ నేషనల్ అంబాసిడర్ నాయుడు గారి రాజశేఖర్, ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.



వైకాపా రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా బెందాళం పద్మావతిని నియమించినందుకు ఆమె ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలో వారి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ఐఎంఎల్ డిపోను ఎందుకు విడదీస్తున్నారు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి కొత్తగా అధిక మొత్తంలో ప్రజాధనాన్ని అద్దె రూపంలో చెల్లించి టెక్కలిలో ఎందుకు పెడుతున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎపిఎస్‌బిసిఎల్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీయవద్దని, టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకై ఇచ్చిన ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని, మూడు తరాలుగా డిపోలో పని చేస్తున్న హమాళీల ఉపాధిని కాపాడాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎచ్చెర్ల డిపో ఎదుట కార్మికులు అర్ధనగ్నంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో యూనియన్ నాయకులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం ఇచ్చినప్పుడు టెక్కలిలో కొత్తడిపో ఏర్పాటు చేయకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చి టెక్కలిలో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డి.బంగార్రాజు, టి.రామారావు, నిడిగంట్ల రమణ, గజినీ శ్రీనివాసరావు, లండ సీతారాం, లింగాల రాము, సొంట్యాన శ్రీనివాసరావు, నవిరి సురేష్, పట్నాన రామారావులు పాల్గొన్నారు.




## హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ఆర్టీసీ ఆధ్వర్యంలో నడపబడుతున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 22వ బ్యాచ్‌ను జిల్లా ప్రజా రవాణా అధికారి (ఇంచార్జి ) పీబీఎంకే రాజు గురువారం ప్రారంభించారు. తదుపరి 23వ బ్యాచ్ సెప్టెంబర్ నెలలో ప్రారంభమవుతుందని, బ్యాచ్‌కి 16మందికే అవకాశం ఉంటుందని, చేరేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 సం నిండినవారు ఈ హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్‌కు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఫీజు, ఇతర వివరాలకు 7382921733 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2వ డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ, పర్సనల్ ఆఫీసర్ కృష్ణవేణి, అకౌంట్స్ ఆఫీసర్ రాజులు పాల్గొన్నారు.



## సరస్వతీపుత్రులకు ఆర్థికసాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పేద విద్యార్థులకు సాయమందించటం ఆనందంగా ఉందని ప్రముఖ న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్ గురువారం అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతా కళ్యాణ అనురాగ నిలయంలో ఉన్న చిన్నారులకు చదువు నిమిత్తం జిల్లాకి చెందిన ప్రముఖ యోగా గురువులు, యోగా రామారావు కుమారుడు ఎంవి.ఎస్.జ్యోతిప్రసాద్, గేదెల ఇందిరా ప్రసాద్‌లు ఆర్థికసాయం చేశారని, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. నిస్సహాయులైన చిన్నారులను అక్కున చేర్చుకొని, వారి జీవితానికి బాసటగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలన్నారు. అన్ని దానాలలో విద్యాధానానికి ప్రత్యేక స్థానముందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కనుగుల దుర్గా శ్రీనివాసరావు, నిక్కు అప్పన్న, అనురాగ నిలయ సిబ్బంది ఆశా కిరణ్, సాయి సుధాకర్, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన జే కామ్ శ్రీకాకుళం 1.0 ఆవిష్కరణ మహోత్సవం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ ఆధ్వర్యంలో జేకామ్ శ్రీకాకుళం 1.0 అనే నూతన వ్యాపార నెట్‌వర్క్ సంస్థ ఆవిష్కరణ మహోత్సవం స్థానిక ఒక ప్రిపేర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ సింగూరు మాట్లాడుతూ జేకామ్ ద్వారా వ్యాపార రంగంలో ఓ విశిష్ట దశను ప్రారంభించనున్నామని, వివిధరంగాలకు చెందిన 22మంది వ్యాపారస్తులు ఈ సంస్థలో సభ్యులుగా చేరారని, జేకామ్ ద్వారా వ్యాపారులకు కొత్త అవకాశాలు, అందుకు దోహదపడే సలహాలు, మెరుగైన మెలుకువలు అందించబడతాయన్నారు. జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు సంతోష్ దూసి కోచ్‌గా, పూర్వ అధ్యక్షులు ప్రవీణ్ బగాది ముఖ్య భూమిక పోషించనున్నారన్నారు. ఈ సందర్భంగా జేసీ సువ్వారి వెంకట సతీష్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయగా, ముఖ్యఅతిధిగా సురేష్ గొంప, ముఖ్య వక్తగా రామసూర్య, విశిష్ట అతిథిగా శివశంకర్ పాల్గొన్నారు. నగర ప్రముఖులు అంధవరపు సంతోష్, మెట్ట నాగరాజు, విశిష్ట అతిధులుగా హాజరై అభినందనలు తెలియజేశారు.

### నూతన కార్యవర్గం

వైస్‌చైర్మన్‌గా హరికృష్ణ, సెక్రటరీగా విజయ్ సంతోష్, డైరెక్టర్‌గా రవితేజలు ఎన్నికవగా, సభ్యులుగా డాక్టర్ శశి కిరణ్, సుదర్శన్, బరాటం సంతోష్, వైకుంఠ సింహాద్రి, రమణ, రమేష్, యుగంధర్, పట్నాల కిరణ్, కూన సంతోష్, కృష్ణ తదితరులు చేరారన్నారు.




# సైన్స్, చరిత్ర, తత్వం.. మూడింటి మేళవింపు ఆ మాస్టర్‌పీస్!

**ఆగస్టు 6, ఆగస్టు 9, 1945- జపాన్ నగరాలైన హిరోషిమా, నాగసాకిపై అమెరికా అణుబాంబులు ప్రయోగించిన రోజులు! ఈ దాడులు కబళించిన జీవితాల సంఖ్య రెండున్నర లక్షలుబీ ఛిద్రం చేసిన బతుకుల సంఖ్య లెక్కలేనంత! ఈ విధ్వంసానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైనవాడు రాబర్ట్ జె. ఓపెన్ హైమర్! అణుబాంబు పితామహు డు అని లోకం కితాబునిచ్చిన అమెరికన్ ఫిజిసిస్ట్. కానీ ఓపెన్ హైమర్ తెలిసే ఇన్ని లక్షల మంది ప్రాణాలు తీశాడా, బాంబు తయారీకి ముందు, తర్వాత ఆయన మనోగతమేంటి? ఆయన మానసిక స్థితి ఏంటి? 13 ఆస్కార్ కేటగిరీలకు నామినేట్ అయ్యి ఏడు అవార్డులు గెలుచుకున్న ఓపెన్ హైమర్ బేసిక్ కాన్సప్టు ఇదే! కై బర్డ్, మార్టిన్ జె.షెర్విన్ 2005లో రాసిన అమెరికన్ ప్రోమెథ్యూస్ అనే బయోగ్రఫీ ఆధారంగా లెజెండరీ ఫిలిం మేకర్ క్రిస్టోఫర్ నోలన్ సైన్సు, చరిత్ర, తత్వం.. ఈ మూడింటినీ మేళవిస్తూ తెరకెక్కించిన మాస్టర్ పీస్ ఇది.**

- శాంతి ఇషాన్

**జూలై 30, ఆ విఖ్యాత దర్శకుడి పుట్టినరోజు సందర్భంగా ఆయన ఓపెన్ హైమర్ గురించి కాసిన్ని కబుర్లు!**

క్రిస్టోఫర్ నోలన్ సినిమాలనగానే మనసు కన్నా మెదడునే సిద్ధం చేసి ఉంచుతాను. ఆయన సినిమాల్లోని కాంప్లెక్స్ కాన్సెప్టులు, లేయర్డ్ స్క్రీన్‌ప్లేలు డీకోడ్ చేయడమంటే నాకు మహా సరదా. ఆ సై-ఫై ఎక్సలెన్స్, సినిమాటిక్ బ్రిలియన్స్‌కి అబ్బురపడిపోతుంటాను. కానీ ఈ దృగ్విషయాలన్నింటినీ కలిపితే కంటే ఓపెన్‌హైమర్ అందించడానికి చాలా ఎక్కువ ఉంది.

నోలన్ సినిమాలంటే పిచ్చి ఇష్టంతో చూసినా అప్పుడప్పుడు ఏదో అసంతృప్తి, కొన్ని సినిమాల్లో సోల్ మిస్ అవుతున్న ఫీలింగ్. ఓపెన్‌హైమర్ ఆ కొరత తీర్చేసింది. నా అభిప్రాయం ప్రకారం, ఇది అంతిమ సినిమాటిక్ అనుభవాన్ని అందించే ఆత్మను కదిలించే చిత్రం. ఒకప్పుడు క్రిస్టోఫర్ నోలన్ సినిమాల్లో ప్రెస్టీజ్, డన్‌కిర్క్ నా అభిమాన సినిమాలు అని చెప్పుకునేదాన్ని. కానీ ఓపెన్ హైమర్ చూశాక అవి పక్కకెళ్ళిపోయాయి. ఒక బయోగ్రఫీని ఇంత క్లాసిక్‌గా ప్రెజెంట్ చేయగలగడం నోలన్‌కే చెల్లింది. సినిమా చూసిన చాన్నాళ్ళ వరకు ఆ యుఫోరియా నుంచి బయటికి రాలేకపోయాను.

ఈమధ్య కాలంలో వచ్చిన నోలన్ సినిమాలన్నీ సై-ఫై సినిమాలే. కానీ ఓపెన్‌హైమర్ ఒక సైంటిస్టు సినిమా, ఒక పీరియాడిక్ మూవీ. ఇందులోనూ సైన్సు ఉంది. కానీ అంతకుమించిన అంతర్మథనం ఉంది. మంచికి, చెడుకి మధ్య ఊగిసలాడే ఓ మనిషి సంఘర్షణ ఉంది. నోలన్ మెజారిటీ సినిమాల్లో సైన్సు ఫిక్షన్‌దే పైచేయి. కానీ ఇందులో ఎమోషన్ మెండుగా కనిపిస్తుంది. రక్తపాతం చూపకపోయినా గుండె మెలిపడిపోతుంది. తెలియని బాధేదో కమ్మేస్తుంది. నాకు తెలిసి నోలన్ సినిమాలు ఇలాంటి లోతైన అనుభూతిని కలిగించడం అరుదే.

### అసలు ఓపెన్‌హైమర్ ఎందుకంత ప్రత్యేకం?

ఓపెన్ హైమర్ అణుబాంబు పితామహుడు. ఒక మామూలు స్టూడెంట్ ఆ స్థాయికి ఎదగడం, అక్కడి నుంచి పతనమైపోవడం- ఇదే ఈ సినిమాకి కథా వస్తువు. ఈ దారి పొడవునా ఓపెన్ హైమర్ మానసిక స్థితిని నోలన్ అద్భుతంగా విశ్లేషించాడు. ఆయన మిగతా సినిమాల కంటే ఈ సినిమా క్రియేటివ్ గాను ఈస్థటిక్‌గాను అనిపిస్తుంది. అణుబాంబు పితామహుడిగా పేరు తెచ్చుకున్నాక జరిగిన పరిణామాలను లోకం ఓపెన్ హైమర్ పతనానికి గుర్తుగా భావించింది. కానీ ఆయన దృష్టిలో అదో పశ్చాత్తాప దశ. చేసిన పాపాలకు పరిహారం చెల్లించుకునే దశ. ఈ రెండు దృష్టికోణాలను నోలన్ గొప్పగా ఆవిష్కరించాడు. లోకానికి తెలిసిన విషయాలను, లోకపు దృష్టికోణాన్ని బ్లాక్ అండ్ వైట్‌లో చూపించాడు. ఓపెన్ హైమర్ పాయింట్ ఆఫ్ వ్యూను కలర్‌లో చూపించాడు. జనరల్‌గా ఫ్లాష్ బ్యాక్ సీన్స్‌కు బ్లాక్ అండ్ వైట్ వాడడం మనకి తెలుసు. ఆ రకంగా చూస్తే ఇది కొత్త ప్రయోగం, గొప్ప ప్రయోగం కూడా!

ఎంత ఎమోషనల్ కనెక్ట్ చూపించినా నేరేటివ్‌లో నోలన్ తన నాన్ లీనియర్ స్టైల్‌ని మాత్రం వదిలిపెట్టలేదు. సినిమా అంతా ఓపెన్ హైమర్ విద్యార్థి దశ, సైంటిస్టు దశ, చివరలో విచారణ ఎదుర్కొంటున్న దశ, లూయిస్ స్ట్రాస్ విచారణ ఎపిసోడ్- వీటి మధ్య వెనక్కీ ముందుకీ తిరుగుతుంటుంది. ఆ మధ్యలో బ్లాక్ అండ్ వైట్, కలర్ సీన్స్ కొంత కన్ఫ్యూజ్ చేస్తాయి. కానీ ఎక్కడా ఎమోషనల్ టచ్ మాత్రం మిస్ కాదు.

ఓపెన్ హైమర్ అంతర్మథనాన్ని నోలన్ చక్కగా ఆవిష్కరించాడు. అతనేమీ పవిత్రాత్మ కాదు. అలాగని పరమ దుర్మార్గుడూ కాదు. ఒక మామూలు మనిషికున్న డ్రా బ్యాక్స్ అతనికీ ఉన్నాయి. ప్రియురాలు టాట్ లాక్ అంటే ఇష్టమే. కానీ తనతో కలిసి బతకలేని నిస్సహాయత. చివరికి టాట్ లాక్ చనిపోతే తన వల్లే చనిపోయిందన్న గిల్టీ ఫీలింగ్. హిరోషిమా, నాగసాకి బాంబింగ్ తర్వాత అంతా సెలబ్రేట్ చేసుకుంటుంటే కాలి బూడిదవుతున్న మనుషులు కనిపించే సీన్ ఎపిక్ లెవల్లో ఉంటుంది. నోలన్ దీన్ని చాలా తెలివిగానే కాక మనసును మెలిపెట్టే విధంగా ప్లాన్ చేశాడు. అసలు రక్తపాతం, విధ్వంసం చూపించకుండానే ఓపెన్ హైమర్ ఎక్స్‌ప్రెషన్స్ రూపంలో గుండెను వణికించేశాడు.

ఇక ట్రినిటీ టెస్టు నాకు బాగా నచ్చిన ఎపిసోడ్. టెస్టు కోసం ప్రిపరేషన్, ఆ టెన్షన్ మొత్తాన్నీ డైరెక్టర్ చాలా చక్కగా ఎలివేట్ చేశాడు. టెస్టు జరిగాక ముందు మంట కనిపించడం, ఆ తర్వాతే సౌండ్ వినిపించడం సైంటిఫిక్‌గా చాలా అక్యురేట్‌గా అనిపించింది. నోలన్ ప్రతి డీటెయిల్‌కీ ఎంత ప్రాధాన్యత ఇస్తాడో ఇలాంటప్పుడే అర్థమవుతుంది. ఎక్స్‌పెక్ట్ చేసినప్పుడు రాని సౌండ్ అన్ ఎక్స్‌పెక్టెడ్‌గా వచ్చినప్పుడు గుండె గుభిల్లుమంటుంది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇంకో అద్భుతం. టెన్షన్ బిల్డ్ అయ్యే కొద్దీ బీట్ పెరుగుతూ పోయి ఒక్కసారిగా పీక్స్ చేరుకుని ఆ సీన్లోని ఇంటెన్సిటీని తెలియజేస్తుంది. ఏమీ చెప్పకుండానే లుడ్విగ్ గోరాన్సన్ కంపోజ్ చేసిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ద్వారా నోలన్ చాలా చోట్ల భయపెట్టించేశాడు. ఏదో తెలియని భయాన్ని, టెన్షన్‌ని క్రియేట్ చేశాడు. ఈ సినిమా గెలుచుకున్న ఏడు అకాడెమీ అవార్డుల్లో ఒకటి బ్యాక్ గ్రౌండ్ స్కోరుకే దక్కింది.

సినిమాలో అక్కడక్కడా గ్రాఫిక్స్ రూపంలో కనిపించే సబ్ అటామిక్ స్ట్రక్చర్స్, అలలు, కణాలు, నిప్పు కణాలు, కాంతి పుంజాలు ఓపెన్ హైమర్ అంతరంగాన్ని విశ్లేషిస్తుంటాయి. వీటిని నోలన్ ప్రత్యేక శ్రద్ధతో చేయించాడట.

సిలాన్ మర్ఫీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అయితే మైండ్‌బ్లోయింగ్‌గా అనిపించింది. నోలన్ సినిమాల్లో చిన్న చితకా క్యారెక్టర్స్ చేసిన మర్ఫీ ఈ లెవల్‌కి ఎదగడం నిజంగా గొప్ప విషయం. మార్వెల్ సిరీస్‌లో ఐరన్ మ్యాన్‌గా అలరించిన రాబర్ట్ డౌనీ జూనియర్ లూయిస్ స్ట్రాస్‌గా, ఎమిలీ బ్లంట్ కిట్టీగా తమ కెరీర్ బెస్ట్ ఇచ్చారు. అందుకే ముగ్గురూ ఆస్కార్ కి నామినేట్ కాగా, మర్ఫీ, రాబర్ట్ డౌనీ అవార్డు సాధించుకున్నారు. బెస్ట్ పిక్చర్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ ఎడిటింగ్ కేటగిరీల్లో మిగతా నాలుగు ఆస్కార్లు వరించాయి. చివరలో ఐన్ స్టీన్, ఓపెన్ హైమర్ మాట్లాడుకున్న ఫ్లాష్‌బ్యాక్ సీన్ ఒకటి కనిపిస్తుంది. ఓపెన్ హైమర్ ఒక చెయిన్ రియాక్షన్‌ని మొదలుపెట్టాడని, అది ప్రపంచాన్నే నాశనం చేస్తుందని ఐన్ స్టీన్ హెచ్చరిస్తాడు. నిజంగానే ఆనాడు మొదలైన చెయిన్ రియాక్షన్ ఇప్పటికీ రకరకాల రూపాల్లో మానవ జాతిని నాశనం చేస్తూనే ఉంది. సైన్స్‌ని సక్రమంగా ఉపయోగించుకుంటే అభివృద్ధి లేదంటే విధ్వంసమే!

**(2025, జులై 21కి ఓపెన్ హైమర్ విడుదలై రెండేళ్ళు).**



# ఒకవైపు పేదరికం.. మరోవైపు బిలియనీర్లు!

దేశ సంపద వికేంద్రీకరణ జరగకుండా కేంద్రీకృతం కావటంతో సమాజంలో పేదల, ధనికుల మధ్య వ్యత్యాసం తీవ్రంగా పెరుగుతోంది. కొద్దిమంది కోటీశ్వరుల వద్ద ఎక్కువ సంపద, కొద్దిమంది భూకామందుల వద్ద ఎక్కువ సాగు భూములు ఉన్నాయి. దీంతో సంపదను సృష్టించే అత్యధిక మంది గ్రామీణ పేదలు, కార్మికులు, శ్రామికులు ఆ సంపదకే దూరంగా ఉన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న బడా పెట్టుబడిదారుల, భూస్వాముల అనుకూల విధానాలే ఇందుకు కారణంగా ఉన్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా పేదరికంలో మగ్గుతున్నవారి సంఖ్య మీద వేర్వేరుగా అనేక నివేదికలు, అంచనాలు ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, ఎనభై కోట్ల ఎనభై లక్షల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం, 101 కోట్ల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. ఈ 101 కోట్ల పేదల్లో సగం మంది 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు కాగా, 13.5 శాతం మంది పిల్లలు 18 ఏళ్ల పైబడినవారు ఉన్నారు. సగం మంది పేదలు పోషకాహార లోపంతో జీవిస్తున్నారు. 83.7 శాతం మంది పేదలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. మొత్తం గ్రామీణ జనాభాలో 28 శాతం మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో పేదలు ఎక్కువగానే ఉన్నారు. ఇండోనేషియాలో చూసుకుంటే 4.70 కోట్ల మంది పేదరికంలో ఉన్నారు. ఆ దేశ జనాభాలో ఇది 18 శాతం కాగా, అత్యధిక పేదలు ఉన్న దేశాల్లో 5వ స్థానంలో ఉంది. పాకిస్తాన్‌లో 5.90 కోట్ల మంది ప్రజలు పేదరికంలో ఉండి, ఆ దేశ జనాభాలో 29 శాతంగా ఉన్నారు. అధిక పేదలు ఉన్న దేశాల్లో 4వ స్థానంలో పాకిస్తాన్ ఉంది. ఆఫ్రికా దేశం నైజీరియాలో 8.60 కోట్ల మందితో పేదరిక పరంగా 3వ స్థానంలో ఉంది. పేదలు, పేదరికంలో ఉన్న దేశాలు సబ్ సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలో ఎక్కువగా ఉన్నాయి.

వివిధ నివేదికల ప్రకారం చైనాలో పేదరికం నేడు తక్కువగా ఉంది. 2020లో 5.60 కోట్ల మంది ఆ దేశ పేదరిక రేటుకు దిగువన ఉన్నారు. ఇది చైనా దేశ జనాభాలో 1.7 శాతంగా ఉంది. 2025లో ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం పేదరికం 0.7 శాతంగా ఉంది. ప్రస్తుతం పేదలు ఎంత శాతంలో ఉన్నారనే సమాచారం అందుబాటులో లేదు. చైనాలో కూడా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వ్యత్యాసాలు ఉన్నాయి. అమెరికాలో కూడా 2022 సంవత్సరంలో 12.4 శాతం పేదల లెక్క బయటపడింది. ఇంకా ఇతర పెట్టుబడిదారీ దేశాల్లోనూ పేదలు గణనీయంగానే ఉన్నారు.

భారతదేశంలో 2011-12 సంవత్సరంలో పేదరికం 27.1 శాతం (34.4 కోట్లు)గా ఉంటే, 2022- 23 నాటికి 5.3 శాతం (7.5 కోట్లకు) తగ్గిందని మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. పేదరికం శాతం తగ్గినా, దేశ ప్రజల్లో 22 శాతం మంది పేదరికంలో జీవిస్తున్నారు. ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం, దేశంలో 35 కోట్ల మంది కనీస అవసరాలు తీర్చుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మోడీ ప్రభుత్వం చెప్పినట్లుగా పేదరికం తగ్గితే, 80 కోట్ల మందికి రేషన్ బియ్యం సప్లయి చేయటం ఎందుకు? భారతదేశంలో పేదరిక అంచనాపై అనేక మంది నిపుణులు, సంస్థలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు.

దేశంలో దారిద్ర్యరేఖను అంచనా వేయటం, పేదరికం గురించి అనేక కమిటీలు చేసిన నిర్ధారణలు కూడా హాస్యాస్పదంగాను, పేదరికాన్ని అపహాస్యం చేసేవిగాను ఉన్నాయి. అమెరికాలో రోజుకు 63 డాలర్ల కంటే తక్కువ ఆదాయం ఉన్న నలుగురు సభ్యుల కుటుంబాన్ని పేదలుగా పరిగణిస్తారు. భారతదేశంలో అర డాలర్ కంటే ఎక్కువ సంపాదించే వారిని పేదలుగా గుర్తించటం లేదు. ప్రపంచ బ్యాంకు మాత్రం భారత్‌లో 2.3 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉన్నవారిని పేదలుగా గుర్తించింది. భారతదేశంలో క్షేత్ర స్థాయిలో పేదరికాన్ని అధ్యయనం చేస్తే కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్యసమితి చెప్పిన లెక్కలన్నీ తలకిందులవుతాయి.



ప్రపంచ దేశాల్లో పేదరికం పెరుగుతూ ఉంటే, మరోవైపు బిలియనీర్లు కూడా పెరుగుతున్నారు. 2025 నాటికి ప్రపంచ బిలియనీర్ల సంఖ్య 3,030 చేరుకుంది. వారి మొత్తం సంపద 12 లక్షల కోట్ల అమెరికా డాలర్లుగా అంచనా. ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితాలో ఎలన్ మస్క్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతని నికర ఆస్తి 377 బిలియన్ డాలర్లు (30.60 లక్షల కోట్ల రూపాయలు). అతని తర్వాత రెండో స్థానంలో మార్క్ జుకర్ బర్గ్ ఉండగా, అతని ఆస్తి 235 బిలియన్ డాలర్లు, జెఫ్ బెజోస్ 227 బిలియన్ డాలర్లతో మూడవ స్థానంలో ఉన్నాడు. వీరు గాక లారీ ఎల్లిసన్ 194 బిలియన్ డాలర్లు, బిల్ గేట్స్ 176 బిలియన్ డాలర్లు, స్టీవ్ బాల్మెర్ 160 బిలియన్ డాలర్లతో ఉన్నారు.

భారతదేశంలో 2024లో 191 మంది బిలియనీర్లు ఉంటే, 2025లో వీరి సంఖ్య 284కు చేరింది. బిలియనీర్లలో ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది. 2015 నుంచి భారతదేశంలో బిలియనీర్ల అదనంగా 123 మంది పెరిగారు. ముఖేష్ అంబానీ 8.60 లక్షల కోట్లు రూపాయలతో (8.6 ట్రిలియన్ రూపాయలు) (ఒక ట్రిలియన్ లక్ష కోట్లు) ప్రథమ స్థానంలో ఉంటే, ఆ తర్వాత గౌతమ్ అదానీ 8.40 లక్షల కోట్ల రూపాయలతో (8.4 ట్రిలియన్ల రూపాయలు) రెండవ స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత రోష్నినాడర్ (హెచ్‌సీఎల్ టెక్నాలజీ) 3.5 లక్షల కోట్లు, దిలీప్ షాంఘ్వీ (సన్ ఫార్మా) 2.5 లక్షల కోట్లు, అజీమ్ ప్రేమ్‌జీ (విప్రో) 2.2 లక్షల కోట్లు, కుమార్ మంగళం బిర్లా (ఆదిత్యబిర్లా గ్రూప్) రెండు లక్షల కోట్లు, సైరస్ పూని వల్లా (సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా) 2లక్షల కోట్ల రూపాయలు, సిరాజ్ (బజాజ్ ఆటో) 1.6 లక్షల కోట్లు, రాధా కిషన్ దమానీ (అవెన్యూ సూపర్ మార్ట్స్) 4.4 లక్షల కోట్ల రూపాయల సంపద కలిగి ఉన్నారు.



భారత బిలియనీర్ల సగటు వార్షిక సంపద 34,514 కోట్లు. దేశంలో వెయ్యి కోట్లు సంపద కలిగి ఉన్నవారి సంఖ్య 1,539 ఉంటే, అందులో 5వేల కోట్ల సంపద కలిగిన వారు 534 మంది ఉన్నారు. నల్లధనాన్ని పరిగణలోకి తీసుకుంటే వీరి సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం, భారతదేశంలోని 1 శాతం సంపన్నుల వద్ద దేశ సంపదలో 58 శాతం కలిగి ఉంటే, దేశంలోని 67 కోట్ల పేదల వద్ద ఒక శాతం సంపద మాత్రమే ఉంది.

13.8 శాతం ఉన్న ధనిక రైతుల వద్ద సాగు భూమి 46 శాతం ఉంటే, 84 శాతంగా ఉన్న చిన్న, సన్నకారు రైతుల వద్ద 47.3 శాతం భూమి ఉంది. దేశంలో కేవలం 4.9 శాతం భూకామందుల వద్ద 32 శాతం భూమి ఉంది. దేశంలోని ఒక పెద్ద భూకామందు ఒక్క సన్నకారు రైతు కన్నా 45 రెట్లు భూమి కలిగి ఉన్నాడు. ప్రపంచంలో కానీ, భారతదేశంలో కానీ బడా పారిశ్రామికవేత్తల, సంపన్నుల, భూకామందుల వద్ద ఆయా దేశాల సంపద, సాగు భూములు కేంద్రీకృతమై ఉన్నాయి. దాని ఫలితమే అనేక దేశాల్లో అత్యధిక ప్రజలు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామీణ ఉపాధి, ఉద్యోగ కల్పన, శ్రమకు తగ్గ వేతనం లభించినప్పుడే పేదరికం తొలుగుతుంది. అందుకు సమగ్ర భూసంస్కరణలతో పేదలకు భూపంపిణీ జరగాలి. పరిశ్రమల్లో కార్మికులకు భాగస్వామ్యం ఉండాలి. బడా కోటీశ్వరుల సంపద ప్రజలపరం కావాలి. ఇవి సాధించుకోవటానికి భారతదేశ గ్రామీణ పేదలు, కార్మికులు, నిరుద్యోగులు, యువజనులు దోపిడీ వర్గాల పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. మిగతా ప్రపంచ దేశాల్లో కూడా ఆవిధంగానే ఉద్యమించాలి.

**- బొల్లిముంత సాంబశివరావు, ది వైర్ కోసం**



## 12వ పే రివిజన్ కమిషన్ నియమించాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



రాష్ట్ర ప్రభుత్వం 2023 జులై 1నుండి అమలు కావలసిన 12వ పీఆర్సీ సంబంధించి పే రివిజన్ కమిషన్ వెంటనే నియమించాలని యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీఆర్సీ అమలు చేసే వరకూ 30% ఇంటీరియర్ రిలీఫ్ చెల్లిస్తూ వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను చెల్లించాలని కోరారు. గత పీఆర్సీ బకాయిలు, పెన్షనరీ చెల్లింపులు, ఏపీజిఎల్ఐ, పిఎఫ్, సరెండర్ లీవ్ చెల్లింపులు చేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. బోధనా మాధ్యమంగా తెలుగు మీడియంను కొనసాగించాలని, బోధ నేతర కార్యక్రమాలను విడనాడాలని, ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంత్ సమస్యలను పరిష్కరించి వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఆగస్టు 2న విద్యారంగ ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద కేంద్రాలలో జరుగుతున్న ఆందోళన కార్యక్రమాలను ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భవిష్యత్తులో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, పీఆర్సీ సాధన కోసం జరిగే ఉద్య మాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు పెన్షనర్లు పెద్దసం ఖ్యలో హాజరై ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేసి, పోరాడి సాధించుకున్న ప్రయోజనాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.



ఇటీవల రేషన్‌డీలర్ల రాష్ట్ర అసోసియేషన్ కమిటీలోకి స్థానం దక్కిన రాజాం మండలం అంతకాపల్లి డిపోకు చెందిన డీలర్ల సమాఖ్య రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వాకుముల్ల జోత్స్నదేవిని, రాజాం పట్టణం ఠాణా వీధి డిపో డీలర్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర జాయింట్ సెక్రటరీ లలితకు మారిని ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ గురువారం సాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ప్రతి రేషన్ డీలర్ నిబంధనలు పాటించి పంపిణీ సజావుగా జరగాలని, ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

**- సత్యంన్యూస్, రాజాం**



మండలంలోని ఎంపీయూపీ కోవెల పాఠశాలలో స్థానిక తురకపేట పీహెచ్‌సీ సిబ్బంది ఎం.ఎల్ హెచ్‌పీ ప్రవల్లిక 6, 7, 8వ తరగతి బాలికలకు రుతు చక్రం సమస్యలపై అవగాహన కల్పించారు. బాలికలు నెలవారి రుతుక్రమంలో అత్యంత జాగ్రత్తగా మెలగాలని, లేకుంటే అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని చార్టుల ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రేవతి, ఆశా కార్యకర్త చిన్నమ్మడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, ఎల్.ఎన్.పేట**

## ప్రజల గుండెచప్పుడు ముఖ్యమంత్రి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ప్రజల గుండెచప్పుడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ రూరల్ మండలం సింగుపురం పంచాయతీ, భైరనాగులపేట, అలికాం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి, ఏడాది పాలానాభివృద్ధి కరపత్రాన్ని అందించి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చే ప్రతీ హామీని అమలుచేస్తామన్నారు. ఇప్పటికే కొన్ని హామీలను ప్రవేశపెట్టి అండగా నిలిచామన్నారు. అనంతరం సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయో లేదో తెలుసుకొని, గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుపరిపాలనతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అభివృద్ధి ప్రదాత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను, తప్పిదాలను పునరావృతం కాకుండా అధినేత జాగ్రత్తవహిస్తూ ప్రజాక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సుపరిపాలనకు సోపానాలని, కేంద్ర సహకారంతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తప్పుడు సమాచారం అందిస్తే వినండి గాని, నమ్మి మోసపోకండని హితవుపలికారు. అనంతరం అలికాం గ్రామంలో సిమెంట్ రోడ్లను ప్రారంభించి, గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ సమస్యకు పరిస్కారమందిస్తానని, టీడీపీ పార్టీ పేదప్రజల పార్టీ అని, రాష్ట్రంలో పేదల నిర్మూలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకువెళ్తుందని, ప్రజలందరికీ అందిబాటులో ఉంటానని, ప్రజాసేవకే తన జీవితమని, తాను అందరివాడినని మరచిపోవద్దన్నారు. కార్యక్రమంలో నగర, మండల అధ్యక్ష బృందం, టీడీపీ నాయకులు, మహిళా నాయకులు, స్థానిక ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.



## రైతులకు ఎరువుల కొరత తీర్చాలి

**(సత్యంన్యూస్, పాతపట్నం)**



కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు తగిన ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైకాపా రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాగు చేస్తున్న భూమికి తగ్గ ఎరువులు రైతులకు అందుబాటులో లేకపోవడంతో పంటల సాగుకు అవరోధాలు ఎదురవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో ప్రధానంగా ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారులకు లాభాలు చేకూర్చుతున్నారన్నారు. ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్తున్న రైతులను నాణ్యత లేని వేపపిండి, రసాయన ఎరువులు, నానో యూరియా, డీఏపీ వంటివి తీసుకోవాలని బలవంతం చేస్తున్నారని రైతులు వాపోతున్నారన్నారు. ఇదే పరిస్థితి పలు గ్రామాల్లో కూడా ఉందని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. గత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతుల పాలిట ఆపద్బాంధవులుగా నిలుస్తూ, సకాలంలో వారికి అవసరమైన సేవలను అందించాయి. ముఖ్యంగా విత్తనాల పంపిణీలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తూ రైతుల నమ్మకాన్ని చూరగొన్నాయన్నారు. రైతులకు సాగుకు ముందు ఎదురయ్యే ప్రధాన సమస్యలలో నాణ్యమైన విత్తనాల కొరత ఒకటన్నారు. ఈ సమస్యను గుర్తించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం, రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా నాణ్యమైన విత్తనాలను, నిర్ణీత ధరలకు, సకాలంలో పంపిణీ చేశాయన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం వెంటనే గుర్తించి, వారికి సక్రమంగా ఎరువులు పంపిణీ చేయడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని రెడ్డి శాంతి డిమాండ్ చేశారు.

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

# నకిలీ దివ్యాంగులకు ఝలక్



**▸▸ నోటీసులు అందినా హాజరు కాని లబ్ధిదారులు**
**▸▸ తాత్కాలికంగా నిలిపేస్తున్నట్టు సెర్ప్ ఎస్‌ఎంఎస్**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సదరం సర్టిఫికెట్ పొంది దివ్యాంగుల పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల పింఛన్లలో అక్రమాలను వెలికి తీసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి సదరం ధ్రువీ కరణ పత్రాలు వెరిఫికేషన్‌ను ప్రారంభించారు. ఇంతవరకు ఉన్న సదరం సర్టిఫికెట్‌ను మరోసారి ధ్రువీకరించుకోవాలని, అందుకోసం ప్రభుత్వ ఆసుపత్రులకు సదరం పత్రాలు తీసుకొని రావాలని దివ్యాంగులందరికీ నోటీసులు పంపించారు. నోటీసులో ఎక్కడికి, ఎప్పుడు హాజరు కావాలి అన్న విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. నోటీసులు పట్టుకొని ప్రభుత్వ ఆసుపత్రులకు హాజరైన వారికి సదరం పరీక్షలు నిర్వహించి అర్హతను నిర్ధారించారు. ఇంకొందరిని రిమ్స్‌కు రిఫర్ చేసి సదరం పూర్తి చేసుకోవాలని వైద్యులు సూచించారు. జిల్లాలో సదరంతో దివ్యాంగుల పింఛన్లు పొందుతున్నవారు 31,330 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు 25 వేల మందిని మాత్రమే వెరిఫికేషన్ పూర్తి చేశారు. కొంతమంది నోటీసులు అందుకున్నా హాజరు కాలేదు. అలాంటి వారందరికీ పంచాయతీ కార్యాదర్శి ద్వారా పలుమార్లు నోటీసులు అందించి సదరం ప్రత్యేక క్యాంపునకు హాజరై రీవెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. అయితే పదే పదే నోటీసులు అందుకున్నా సదరం రీవెరిఫికేషన్‌కు హాజరుకాని లబ్ధిదారులకు ఆగస్టు ఒకటి నుంచి పింఛన్‌ను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్టు సెర్ప్ నుంచి లబ్ధిదారుల ఫోన్‌కు సందేశం పంపిస్తున్నారు. రీవెరిఫికేషన్ పూర్తిచేసుకున్న తర్వాత మాత్రమే పింఛన్‌ను పునరుద్ధరించనున్నట్టు ఫోన్‌లో పంపిన సందేశంలో సెర్ప్ పేర్కొంది. జిల్లాలో ఇప్పటి వరకు 6వేల మంది సదరం రీవెరిఫికేషన్ చేసుకోవాలి. వీరికి సెప్టంబర్ వరకు గడువు ఉంది. అయితే వీరిలో 50శాతం మంది మాత్రం నోటీసులు అందుకున్నా రీవెరిఫికేషన్‌కు హాజరు కాలేదని అధికారులు చెబుతున్నారు. గురువారం రిమ్స్‌లో నిర్వహించిన సదరం రీవెరిఫికేషన్‌కు 150 మంది దివ్యాంగులు హాజరయ్యారు. వీరికి వైద్యులు భౌతిక పరీక్షలు నిర్వహించి రీవెరిఫికేషన్ చేస్తున్నారు. వీరంతా పింఛన్ నిలిచిపోతుందని ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం మాత్రం ఎన్ని పింఛన్లను తాత్కాలికంగా నిలిపేస్తుందన్నది ఇప్పటికీ స్పష్టం చేయలేదు. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. శుక్రవారం ఆగస్టు నెలకు సంబంధించిన పింఛన్లు పంపిణీ కానుండడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు.

**20 టీమ్‌లు పరిశీలన**

నకిలీ సదరం సర్టిఫికెట్లతో చాలామంది వికలాంగుల పింఛన్లు పొందుతున్నారంటూ ప్రజాగ్రీవెన్స్‌లో అనేకసార్లు ఫిర్యాదులు అందాయి. ఆ మేరకు చూసుకుంటే వేలకొలదీ గత ప్రభుత్వ హయాంలో నకిలీ వికలాంగులు పింఛన్లు పొందుతున్నారు. మరికొందరైతే ఏకంగా ప్రభుత్వ ఉద్యోగాలు కూడా ఈ సర్టిఫికెట్ల మీదే చేస్తున్నారు. మరోవైపు కొత్తగా వికలాంగ పింఛన్లకు దరఖాస్తు చేసుకోడానికి ప్రతీ గురువారం రిమ్స్‌తో పాటు ప్రభుత్వం నిర్దేశించిన పీహెచ్‌సీల్లో వికలాంగులు బారులుతీరుతున్నారు. ఇందులో పింఛనుకు పూర్తిస్థాయి అర్హత ఉన్నవారు చాలామంది ఉన్నారు. నకిలీ పింఛన్లు తొలగిస్తే గాని, కొత్తవి ఇవ్వలేమని ప్రభుత్వం పేర్కొనడంతో సెర్ప్ తాజాగా 20 టీమ్‌లు పరిశీలించి ఇచ్చిన నివేదిక మేరకు వారి మొబైల్ ఫోన్లకు ఎస్‌ఎంఎస్ పంపింది. వీరిలో అధిక శాతం మంది స్థానిక రాజకీయ నాయకులను ఆశ్రయించి ఇన్నాళ్లూ రక్షణ పొందుతూవచ్చారు. కానీ ఇప్పుడు మళ్లీ సర్టిఫికెట్ పునరుద్ధరించుకోకపోతే పింఛను తీసేస్తామని పేర్కొనడంతో ఆసుపత్రుల వద్ద బారులుతీరిన క్యూలైన్లు కనిపిస్తున్నాయి.




## శ్రేష్టకర్మలతో మహనీయులు అవుతారు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మానవులు శ్రేష్టకర్మలతో మహనీయులవుతారని జిల్లా గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సంస్థ కన్వీనర్, బూర్జ మండల ఉపాధ్యక్షులు బుడుమూరు సూర్యారావు అన్నారు. ఇలిసిపురం బ్రహ్మకుమారిస్ సేవా కేంద్రానికి మన్మోహిని దీదీ స్మృతిదినం సందర్భంగా వచ్చిన ఆయన మాట్లాడుతూ శిల ఉలితో శిల్పంగా మారుతుందన్నారు. బ్రహ్మకుమారిస్ జయలక్ష్మి మాట్లాడుతూ కోట్లకు అధిపతి అయినా చైతన్య ఆత్మ ఉన్నప్పుడే సమస్త విశిష్టతలు వ్యక్తి పరిగణలోకి వస్తాయన్నారు. రిటైర్డ్ మిలటరీ రమణ మాట్లాడుతూ మనం ఎవరమనేది ప్రతిఒక్కరు గుర్తించాలని, మనందరికీ మూడు కాలాల జ్ఞానాన్ని ప్రసాదించే వారు పరమాత్మ అని అన్నారు. మానవతా సంస్థ కన్వీనర్ పార్వతీశం మాట్లాడుతూ ఇటువంటి సంస్థలు ప్రపంచంలో శాంతి నెలకొల్పడనికి ఆధారమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ రాజారావు బ్రహ్మకుమారిస్ పాల్గొన్నారు.

## కలిశెట్టి సైకిల్‌పై బాలకృష్ణ



**న్యూఢిల్లీ:** ప్రముఖ సినీనటులు, హిందూపూర్ శాసన సభ్యులు, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ గురువారం ఢిల్లీలో పార్లమెంట్‌ను సందర్శించిన సందర్భంగా విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, సహచర ఎంపీ, ప్రొటెం స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌తో పార్లమెంట్ ఆవరణలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పార్లమెంట్ ఎంట్రన్స్ గేటు పక్కన పార్కింగ్‌లో ఉన్న విజయనగరం ఎంపీ సైకిల్‌ను చూసిన బాలకృష్ణ సైకిల్ దగ్గరకు వెళ్లి ఎంపీతో మాట్లాడుతూ సైకిల్‌ను చూసి ఒక్కసారిగా అలనాటి ఎన్టీఆర్ జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయన్నారు. తెలుగువాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎన్టీఆర్ పెట్టిన టీడీపీ పార్టీ గుర్తు సైకిల్‌పై పార్లమెంటుకు రావడం అభినందనీయమని కొనియాడారు. అలాగే పార్టీ ప్రాముఖ్యతను భారతదేశం అంతా తెలిపే విధంగా పార్టీ సింబల్ సైకిల్‌ను పార్లమెంట్ ప్రవేశ ద్వారం పక్కన ఉండటం హర్షనీయమన్నారు. రోజూ కలిశెట్టి పార్లమెంటుకు సైకిల్‌పై వస్తున్న విషయం తెలుసుకొని అభినందించారు. సరదాగా సైకిల్‌పై కూర్చుని, ఫోటోలు తీయించుకొని ఎంపీతో సరదాగా ఢిల్లీ విషయాలపై సంభాషించారు.




## మాజీ జెడ్పీటీసీ గొర్లె లక్ష్మణరావు కన్నుమూత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రణస్థలం మాజీ జడ్పీటీసీ, సీనియర్ రాజకీయ నేత గొర్లె లక్ష్మణరావు కన్ను మూశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఆయన తుది శ్వాస విడిచారు. 1962లో పాతర్లపల్లి గ్రామంలో జన్మించిన ఈయన విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తిగా, ఎన్నో విద్యార్థి, ప్రజా సమస్యలపై పోరాడిన నేతగా జిల్లా ప్రజలకు సుపరిచితులు. దివంగత మాజీ ఎమ్మెల్సీ గొర్లె హరిబాబు నాయుడు, ప్రముఖ న్యాయవాది గొర్లె రామారావుకు ఈయన సోదరుడు. 1983లో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలకు కార్యదర్శిగా, 1984లో కళాశాల విద్యార్థి సంఘ చైర్మన్‌గా ఎన్నికై విద్యార్థుల సమస్యలు పరిష్కారంలో కీలక పాత్ర పోషించారు. 1989లో విశాఖపట్నం ఎన్‌వీపీ లా కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షుడుగా ఎన్నికై విద్యార్థులకు హాస్టల్ సదుపాయాలు, మెరుగైన బోధన, ఉపకార వేతనాల కోసం ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో ఎన్నో ఉద్యమాలు చేశారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సుదీర్ఘకాలం సేవలు అందించిన ఈయన ఎన్టీఆర్ ముఖ్య మంత్రిగా ఉన్న కాలంలో శ్రీకాకుళం జిల్లాకు రూరల్ యూనివర్సిటీ ఏర్పాటు హామీ ఇచ్చినా, అది నల్గొండకు తరలిపోవడంతో ఎచ్చెర్లలో రూరల్ యూనివర్సిటీగా ఏర్పాటు చేయాలని కోరుతూ లక్ష్మణరావు చేసిన పోరాటంలో కొద్ది రోజులు జైలు జీవితాన్ని కూడా అనుభవించాల్సి వచ్చింది. లక్ష్మణ రావు కృషి ఫలించి తొలుత ఎచ్చెర్లలో పీజీ సెంటర్ ఏర్పడగా, తర్వాత అది యూని వర్సిటీగా రూపుదిద్దుకుంది. శ్రీకాకుళం జిల్లాలో ప్రముఖ రాజకీయ నేతగా, 14 ఏళ్లు డీసీసీ అధ్యక్షుడిగా గొర్లె హరిబాబు నాయుడు పనిచేసిన సమయంలో అన్నకు చేదోడు వాదోడుగా ఉంటూ కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించడంలో గొర్లె లక్ష్మణరావు ప్రముఖమైన పాత్ర పోషించారు. ఈయనకు భార్య ప్రసన్న లక్ష్మి, ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కుమార్తె దేవినేహదత్త నాయుడు ఉన్నారు. గొర్రె లక్ష్మణరావు మృతికి తెలుగు రాష్ట్రాల్లో వివిధ రాజకీయ పార్టీలు నేతలు పౌర సంఘాల నేతలు తీవ్ర సంతాపం తెలిపారు.

## టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

**❖ సీనియర్ సహాయకులుగా నియామక పత్రాలు అందజేసిన జడ్పీ చైర్‌పర్సన్ విజయ**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా పరిషత్‌లో టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్‌ల నుంచి సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ గురువారం బంగళాలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ సహాయకులుగా పదోన్నతి పొందిన ఉద్యోగులు కష్టపడి పని చేసి జిల్లా పరిషత్ యాజమాన్యానికి మంచి పేరు, ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. అర్హులైన జూనియర్ అసిస్టెంట్ / టైపిస్ట్‌లకు సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పిస్తూ నియామక పత్రాలను అందజేశారు. పలాస మండల ప్రజాపరిషత్ టైపిస్ట్ జి.లక్ష్మణరావును టెక్కలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పిస్తూ నియామక పత్రం అందజేశారు. అలాగే ఆర్.కిషోర్ కుమార్, జి.ఈశ్వరరావు, ఎస్.సంపత్‌కుమార్, జె.మీరాభాయ్, సంజయకుమార్ సాహు, బి.శివరాం, పి.మాలతి, పి.వి.మిశ్రా, జి.వి.రమణ, బి.గిరిలకు పదోన్నతి కల్పిస్తూ నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజా, జెడ్పీ సీఈవో, డి.సత్యనారాయణ, ఉప ముఖ్య కార్య నిర్వహణాధికారి, సి-సెక్షన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సి. సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.